# మరుగులా-మెరుగులా

శ్రీ తాళ్లూరు నాగేశ్వరరావు

...యికీ నాయకులు పెళ్ళి చేసుకుంటామని కలలు కంటోన్న పరిస్థితుల్లో—ఒక సంఘటనవల్ల నాయకుడు జైల్లో పెట్టబడతాడు; అంతటితో షోకు ఇంటర్‌వెల్ అయింది. లైట్లు వెలిగాయి. సోఫాలో కూర్చున్న ఈశ్వరరావు ఆవలిస్తూ, వొళ్ళు విరుచుకుంటూ—ముందుకు చూశాడు. అతని కళ్ళు చెదిరిపోయాయి. తలలోకి నీరు ఎక్కింది. నాసికా రంధ్రాల్లోకి వేడిగాలి ప్రవహించింది. కళ్లు తెరిచి, నోరు తెరుచుకొని అట్లాగే చూస్తూ వుండిపోయాడు ఒక్క నిమిషంపాటు.

రమ! ప్రక్కన ఒక పురుషుడు, పైగా యువకుడు. నవ్వుతూ మాట్లాడుకుంటున్నారు. దిగ్భ్రమ చెందిన ఈశ్వరరావు మనస్సు నయాగరా జలపాతమైంది.

తన రమేనా? ఎంత సాహసం? ఎంత వంచన? తను ప్రేమిస్తోన్న, తన జీవితానికొక కాంతిరేఖను విశ్వసించిన—రమేనా? ఆమె ప్రక్కన ఆ యువకు డెవడు? రమ భుజం మీదుగా సోఫామీద చేయి వేశాడు. ఎంత ధైర్యం?...రమ! ఛీ...తను ఇక ఆ పేరు తలచకూడదు. తనను నమ్మిస్తూ, తనవాడుగా చేసికొని తనలో విశ్వాసాన్ని కలిగిస్తూ—తనను ఎంత మోసం చేసింది? తను లేనిది బ్రతకలే నన్నది. తను జీవితానికొక వెలుగన్నది. బ్రతుకును ఆదర్శప్రాయంగా చేయవలసిన బాధ్యత తనమీద ఉందన్నది—అంతా బూటకమేనా? ప్రేమించటం—ఒకటేనా? తనను దాసుడుగా చేసుకోవటం—వినోదమా?

ఇంకా వాళ్లు నవ్వుకుంటూనే మాట్లాడుకుంటున్నారు........

లైట్లు ఆరిపోయినయ్. తెరమీద అడ్వర్టైజ్‌మెంట్లు మారుతున్నాయి.

ఈశ్వరరావు హృదయం ఎడారిలో కమ్ముకున్న కారుచీకటి అయింది. సినిమా మీద మనస్సు పోలేదు. ఏకాంతంగా కూర్చుని—గుండె పగిలేట్లు ఏడ్వాలనుకున్నాడు. వెంటనే బయటికొచ్చి, రిక్షాలో కూలబడి ఇంటికి చేరుకున్నాడు.

రూములో కూర్చొని దుఃఖించ నారంభించాడు.

ఇన్నాళ్ళుగా రమమీద ఎంతో ఆశతో జీవిస్తూ వచ్చాడు. ఈనాడు ఆ ఆశ తాలూకు దారం తెగిపోయింది. ఇక తన జీవితం—గానుగెద్దు సామెతే! ఆఫీసూ, బజారూ, హోటళ్ళూ—ఏ ఆతురతా, అనుభూతీ ఉండదు. ఎదురుచూడటం, ఎదురు చూడబడటం, ఉద్రేకం, ఉత్సాహం, ఆరాటం—ఏమీ వుండవు. తన రమ...తన రమ కాదు. తన ప్రేమను—ఆటబొమ్మగా భావించి ఆ బొమ్మతో ఆడుకుంది. తనను పిచ్చివాణ్ణి చేసింది.

మొట్టమొదటగా ఆరోజు హోటల్లో పరిచయం అయింది. తనే పరిచయం చేసుకున్నాడు. అంతకుముందు తను హోటల్లో చాలాసార్లు చూశాడు. ఆరోజు హోటల్లోని జనం ఎక్కువగా ఉండటం, కూర్చునేందుకు జాగా లేక ఆమె కూర్చున్న టేబుల్ దగ్గరకు వెళ్ళి,—"క్షమించండి! మీకు ఏమీ అభ్యంతరం లేకపోతే ఇక్కడ కూర్చొని కాఫీ త్రాగుతాను" అన్నాడు తను చాలా అమాయకంగా. ఎందుకో సిగ్గుపడ్డా డామె. తను సాహసే మయ్యాడు. మరునాడు కూడా తను ఆ టేబులు దగ్గరే, ఆమె ఎదురుగానే కాఫీ తీసుకోవలసి వచ్చింది. ఆమెను మెల్లగా సంభాషణలోకి దించి పేరూ, చేస్తోన్న ఉద్యోగమూ కనుక్కున్నాడు. అంతే! ఆమెను గురించి తనకు ఇప్పటికీ ఏమీ తెలీదు.

కాని తను ఆమెను ప్రేమించాడు. ఆమెతో కలిసి కాఫీ త్రాగేందుకు అరగంట ముందుగా ఆఫీసునుంచి ఏదో వంకతో వచ్చేవాడు. ఆమెకూ తనమీద గొప్ప భావం ఉన్నట్టు తను త్వరలోనే తెలుసుకోగలిగాడు. అప్పటినుంచీ తన ప్రేమ ఒక రూపాన్ని ఏర్పరచుకుంది.

తనతోపాటు రెండు మూడు సార్లు సినిమాకు తీసుకెళ్ళాడు. ఒకటి రెండు సార్లు బీచికి తీసుకెళ్ళాడు. ఆ రోజు బీచ్‌లో, వెన్నెల్లో కూర్చున్నప్పుడు తను కొంత సాహసం చేసి ఆమె మనస్సులోని అభిప్రాయాన్ని తెలుసుకున్నాడు. అమాంతంగా కౌగిలించుకొని, వెన్నెల్లో—

"రమా! ఇంత సౌందర్యమూ, యింత మాధుర్యమూ యిన్నాళ్ళుగా దాచావా?" అన్నాడు తను సినిమాలో నాయకుడు మాట్లాడినట్టు.

రమ "అవును" అన్నది.

తన హృదయం సంతోషంతో గంతులేసింది. శరీరం ఉద్రేకంతో ఉప్పొంగింది.

కాని ఆ రమే తనను మోసం చేసింది. ఇంకో యువకుణ్ణి ఆరాధిస్తూ తనను దాసునిగా చేసుకోవాలని చూస్తోంది. ఎంత నీచం? ఆమె హృదయంలోని మాలిన్యాన్ని ఇన్నాళ్లుగా పసిగట్టలేకపోయాడు తను. రమ తను అర్థం చేసుకొన్న వ్యక్తి కాదు. ఆమె కోసం తను ఇన్నాళ్ళూ ప్రాకులాడటం—కేవలం అవివేకం! రమకు వేరే జీవితం ఉంది. వేరే ప్రియుడు ఉన్నాడు........

తలంచుకొన్న కొద్దీ ఈశ్వరరావులో ద్వేషమూ, దుఃఖమూ సమ్మిళితమై—మనిషిని తల్లక్రిందులు చేస్తున్నాయి.

## 2

ఆఫీసునుంచి అయిదు గంటలకు బయటపడి రమ శ్రీకృష్ణ విలాస్‌లోకి రోజూలాగానే జొరబడింది. ఆ మూల టేబుల్ దగ్గర కూర్చుంది. ఆమె కళ్లు కిటికీ చువ్వల్లోంచి చూపు సారిస్తూ బజారుమీద పని చేస్తున్నాయి. ఒక వ్యక్తికోసం నిరీక్షిస్తోంది. ఆ నిరీక్షణకు ఆమె చాలా తక్కువసార్లు అలవాటు పడ్డా, ఎందుకో ఆ రోజు ఆ నిరీక్షణలో ఆతురత, ఆవేశమూ ధ్వనించాయి. కారణమేమిటంటే—రోజూ అయిదూ పది నిముషాలు ముందుగా హాజరయ్యే ఈశ్వరరావు ఇంకా రాలేదు. బోయ్ నిలబడ్డాడు ఆర్డర్ కోసం. ఏం చేస్తుంది? కాఫీ తీసుకు రమ్మన్నది.

కాఫీ త్రాగుతోన్నంతసేపూ రమ కళ్లూ, మనస్సూ, బజారుమీదే ఉన్నాయి. కాని ఈశ్వరరావు రాలేదు. అయిదున్నర వరకూ ఆ టేబుల్ దగ్గరే కూర్చుని రమ తిరువాత ఇంటికి వెళ్ళింది.

ఆ రోజు రాత్రి రమ, ఈశ్వరరావు రాని కారణాలను వెతికేందుకు చాలసేపు శ్రమపడి ఆలోచించి—మనస్సుకు తృప్తి కలిగించే నిర్ణయానికి రాలేకపోయింది.

మరునాడు కూడా అయిదు గంటలకు హోటల్లో రమను ఈశ్వరరావు కలుసుకోలేదు.

మూడో రోజు కూడా అతను ఆమెతో కలిసి కాఫీ త్రాగేందుకు రాలేదు.

రమ మనస్సు పూర్తిగా పట్టు తప్పిపోయింది. ఆమె హృదయంలో అనేక రకాలైన అనుమానాలు పాదలు దించుకొని పాతుకుపోయినవ్. ఒక వ్యక్తిని గురించి



రమ ఆ నిరీక్షణకు చాల రోజులుగా అలవాటుపడ్డా, ఎందుకో ఆ రోజు ఆతురత, ఆవేశమూ ధ్వనించాయి

అనుమానం కలుగవలసిన పరిస్థితి ఏర్పడ్డప్పుడు —ఒకటికి రెండుసార్లు యోచించవలసిన బాధ్యత వుంటుంది. కాని ప్రేమ వ్యవహారంలో పడ్డవాళ్లు అటువంటి బాధ్యతను మరిచిపోతారని వేరే చెప్పనక్కర్లేదు. తమ తోటిదే ప్రపంచమని మురిసిపోవటంతోనే వాళ్లు ఎక్కువ కాలాన్ని వినియోగిస్తారు. ఇంతకూ చెప్పవచ్చిందేమిటంటే. రమకు ఈశ్వర్రావు మీద కలిగిన అనుమానాలకు ప్రత్యేకమైన ఆధారాలు ఏమీ లేవు. కేవలం గాలిలో దియ్యాల లాంటివి!

ఈశ్వర్రావు అనుకుని రాలేదేమో! ఎందుచేతనో జ్వరం మొహనా వచ్చిందేమో! తను ఇల్లు తెలిసి ఎలా వెళ్ళడం? ఎప్పుడూ తనను ఇంటికి తీసుకు వెళ్ళలేదు. లేకపోతే ఏదైనా అవసరమైన పనిమీద ఊరు వెళ్ళాడేమో! తన కొండంత అనుమానాలు! రేపు తప్పకుండా తనను కలుసుకోవచ్చు! తాత్కాలికంగా మనస్సుకు తృప్తి కలిగించుకొని వూరుకుంది రమ. కాని నాలుగో రోజు కూడా అయిదు గంటలకు శ్రీకృష్ణ విలాస్ లోకి ఈశ్వర్రావు రాలేదు. రమ బరువెక్కిన హృదయంతో కాఫీ త్రాగకుండానే బయటికి వచ్చింది. ఎటువంటి ఆలోచనకూ తావివ్వటానికి ధైర్యం చాలటంలేదు. ఏమైనాడు ఈశ్వర్రావు? తనను చూడకుండా ఎట్లా వుండగలుగుతున్నాడు? ఇవే ఆమె మనస్సును పట్టి పీడిస్తోన్న ప్రశ్నలు.

సాయంత్రం బాగా వాలిపోయింది.

ఏం తోచక రమ బీచికి వెళ్ళింది. ఇసుక మీద కూర్చుంది. ఈశ్వర్రావును తెలుసుకొన్న కొద్దీ—అనుకోరాని అనుమానాలకు మనస్సు గురైంది. దుఃఖం కట్టలు త్రెంచుకు వెల్లువలా వస్తోంది. నీటిమీది అలలకేసి చూస్తూ అట్లానే ఆ ధ్యానంలో చాలసేపటివరకూ ఉంది.

కొంచెం దూరంలో నవ్వుల సవ్వడి వినపడి —వెనక్కు తిరిగి చూసింది రమ.

ఆమె వూపిరి ఒక్కసారి స్తంభించినట్లయింది. అల దిమ్మెత్తి, కళ్ళు గిర్రున తిరిగినంత పనైంది.

ఈశ్వర్రావూ, ఎవరో పదహారేళ్ళ యువతీ కిలకిలా నవ్వుకుంటూ వెళ్తున్నారు.

ఈశ్వర్రావు రమను చూడలేదా?

చూసి కూడా అట్లా నటించాడా?

ఆమె ఎవరని? ఎందుకట్లా నవ్వుకుంటున్నారని? ఆమె సంగతి ఈశ్వర్రావు తనతో ఎప్పుడూ చెప్పలేదే! అతని ఆరాధ్య దేవతా? ....మరి తనూ! ఇన్నాళ్లుగా నమ్మి, ప్రేమించి ఆశల అంచులమీద విహరిస్తూ......తనకే అన్యాయం చేస్తాడా? తను తప్ప అతనికి వేరే ప్రపంచమే లేదని భ్రమపడిందే; అతను ఆ విషయాన్ని గట్టిపర్చాడు కూడా! అదంతా నటనేనా? తనను మురిపించటానికి అన్నమాటలేనా? అంత అగత్యమేమొచ్చింది? తన మీద నిజమైన ప్రేమ లేదూ! తనను కేవలం 'అందమైన స్త్రీ' గా భావించి, తన అందంకోసం ప్రాకులాడుతున్నాడా?

ఈశ్వర్రావు వంచకుడు. ఒక ఆడదాని హృదయాన్ని తన వైపునకు లాగి, ఆ హృదయంలోకి బల్లాలను గుచ్చుతున్నాడు. మరో స్త్రీతో సంబంధంకోసం వుచ్చులు పన్నుతున్నాడు. అతని నైజం అంతేనేమో! తను కనిపెట్టలేక పోయింది. అతనే తన జీవితానికి వెలుగుబాట, ఆదర్శజ్యోతి—అని నమ్మడంతో తనకు అతని అంతరంగాన్ని పరీక్షించవలసిన అవసరం ఏర్పడలేదు.

నాలుగు రోజులుగా తనకు ఎందుకు అగపడటంలేదో అర్థమైంది...తనను ప్రేమించినట్టు ఎందుకు ప్రవర్తించాలి? 'ప్రేమ' అనే పదార్థాన్ని ఎరగా వుపయోగించి—తన హృదయంతో ఆటలు ఆడుతున్నాడా?

(మిగతా 60 వ పేజీలో)

# [illegible]

(9 వ పేజీ తరువాయి)

ఎంత దారుణమైన వంచన? స్త్రీ ప్రేమతో ఆటలా?

ఆ రాత్రి రమ ఎంతో సేపటివరకు ఈశ్వరరావుమీద కోపంతో గింజుకులాడింది— నిద్రపోవటం కష్టం. అయితే— ఈశ్వరరావు మరో యువతి ప్రేమకోసం ప్రయత్నాలు జరుపుతున్నాడనీ, ఆ ప్రయత్నాల్లో కృతకృత్యుడు కాబోతున్నాడనీ ఆమె గట్టిగా నిశ్చయించుకుంది.

## 3

శ్రీ కృష్ణవిలాస్ మెట్లమీద ఉండగానే రమకు బిల్లు చెల్లిస్తున్న ఈశ్వరరావు అగపడ్డాడు. కాని తీరా ఆమె మెట్లు ఎక్కి లోపలకు ప్రవేశించగానే, ఈశ్వరరావు ముఖం ప్రక్కకు పెట్టి గబగబా మెట్లు దిగి వెళ్ళిపోయాడు.

రమ నిశ్చేష్టురాలై నిలబడిపోయింది.

కళ్ళవెంట నీళ్ళు తిరిగినయ్. చూస్తూండగానే ఈశ్వరరావు రిక్షా ఎక్కి వెళ్ళిపోయాడు.

ఈశ్వరరావు తనవాడు కాడు. తనమీద అతనికి ప్రేమ లేదు. తనంటే అతనికి అంత ద్వేషం ఎందుకు కలిగింది? ఆమే కారణం. ఆమె మోజులో పడే తనను మరిచిపోయాడు. ఇంకో స్త్రీని చూడగానే జారిపోయే అతని మనస్సు, ప్రేమ, హృదయం—ఏం లాభం? తన పరిస్థితి ఎండమావుల చందమైంది. తను ఈశ్వరరావును నమ్మటం, అతన్నే జీవిత సర్వస్వంగా భావించి—జీవితం కుదుటపడిందని ఆనందించటం—ఎంత అవివేకం? అతను తనను నమ్మించటంలో అతని ప్రత్యేకత ఏమిటి? ఇప్పుడు మళ్ళీ మరో యువతిని వెంటేసుకొని వీధుల వెంట షికార్లు కొడుతూ తనను చూడటానికి భయపడుతూ—సంచరించడం ఏమిటి? ఇంతకంటే అన్యాయం మరొకటి ఉందా? ఒక స్త్రీ హృదయంలో దీపాన్ని వెలిగించి, ఆ దీపాన్నే ఆర్పేసేందుకు ప్రయత్నించడం ఏం నీతి?

రమకు బ్రతుకుమీద చాల అసహ్యం ఏర్పడ్డది. ఒక పురుష వ్యక్తివల్ల మోసగింపబడ్డాననే అవమానానికి ఆమె చాల ఘాటుగా గురైంది. ఆ రాత్రి చాలసేపటివరకూ ఆమె ఏడ్చింది. ఆమెకు ఎటు చూసినా దుఃఖమే మిగిలింది. ఆమె మనస్సుల్లో విహరింప జేసిన భావాలు, ఊహాపుంకలై నీటిలో ఇసుక జారిపోయినట్లు జారిపోయి— “ప్రేమంటే ఏమిటనుకున్నావ్?” అన్న ప్రశ్నను మిగిల్చి వెక్కిరించాయి.

మరునాడు రమ ఆఫీసుకు వెళ్ళలేదు. తలనొప్పిగా వున్నదన్న కారణం చూపింది. కాని ఆమె ఇంకా ఈశ్వరరావును గురించి తీవ్రంగా ఆలోచిస్తూనే ఉంది.

సాయంత్రం కాగానే రాఘవరావు అంటే రమ అన్నయ్య—బలవంతం చేసి, బీచ్‌కి వెళ్ళితే చల్లగాలివల్ల తలనొప్పి పోతుందని చెప్పి బీచ్‌కి తీసుకెళ్ళాడు. అస్తమించే ఎర్రని సూర్యకాంతికి సముద్రపు అలలు కొత్త అందాన్ని ఏర్పరుచుకొంటున్నాయి. ఆ అందాన్ని చూస్తూ నీళ్ళవొడ్డున రాతిమీద ఇద్దరు యువతీ యువకులు కూర్చున్నారు. ఆమె రెండు జడల మధ్య నెలవంక ఆకారంగా అమర్చబడ్డ పువ్వుల శోభ అటు వెళ్ళే వాళ్ళనందరిని నిలిపి మరీ చూడనిచ్చాయి. అతను నీళ్ళు అరచేతితో కదిలిస్తూ ఏమిటో చెబుతున్నాడు. ఆమె అతనివంక చూస్తూ శ్రద్ధగా వింటోంది.

రమా, రాఘవరావూ అటు వెళ్ళారు. ఆ ఇద్దరినీ చూడగానే రమ మనస్సు చివుక్కుమంది. అతనే ఈశ్వరరావు, ప్రక్కన ఆమె... రమకు కాళ్ళక్రింద ఇసుక రేణువులు జారిపోతున్నట్లనిపించింది. హృదయంలో దడ బయలుదేరింది. కాని రాఘవరావు ఉత్సాహంగా ముందుకు నడుస్తున్నాడు. వాళ్ళను సమీపించబోతున్నాడు. ఈశ్వరరావు ప్రక్కన కూర్చున్న ఆమె దెబుగ్గా వెళ్ళి—

“ఉషా!” అన్నాడు.

రమ హృదయంలోని దడ మరీ ఎక్కువైంది.

ఈశ్వరరావు ప్రక్కన కూర్చున్న ఆ యువతి నవ్వుతో లేచింది.

“మా అన్నయ్య—ఈశ్వరరావు. వీరు... నా క్లాస్‌మేటు రాఘవరావు...” ఉష పరిచయం చేసింది.

ఆమె! ఆమె—ఈశ్వరరావు చెల్లెలన్న మాట! ఛీ...తను ఎంత అనుమానపడింది! తను అనవసరంగా ఇన్నాళ్ళుగా బాధపడింది! మరి ఈశ్వరరావు తనను చూస్తూ అంత ముఖం ఎందుకు తప్పుకోవాలి?

“రమా! రా!”

రమ వచ్చింది.

“మా చెల్లెలు రమ” రాఘవరావు వాళ్ళకు పరిచయం చేశాడు.

అతని చెల్లెలేనా రమ. ఛీ! తను ఎంత అనుమాన పడ్డాడు. ఆరోజు సినిమాహాల్లో ఒకళ్ళ ప్రక్కన ఒకళ్ళు కూర్చున్నది అన్నా చెల్లెళ్ళన్నమాట...తను దుర్మార్గుడు! ఇన్నాళ్ళుగా రమను బాధపెడుతూ వచ్చాడు.

రమ వంక చూశాడు, ఈశ్వరరావు.

ఆ సమయంలోనే రమకూడా అతనివంక చూసింది. అతని కళ్ళల్లోని ప్రశాంతతకు ఆమె సిగ్గుపడ్డది. రాఘవరావు వీళ్ళ చూపులు గమనించలేదు. తన ప్రేయసి ఉష చెక్కిలి మీద చిందిపడిన నీటి బిందువుల సోయగాన్ని తిలకిస్తున్నాడు.

సాయంత్రం ఏడున్నర వరకూ వాళ్ళు సరదాగా కలిసి కబుర్లు చెప్పుకున్నారు. కాని రమా, ఈశ్వరరావులు తమ సంభాషణలో ఎక్కడా తమ పాత పరిచయాన్ని బయట పెట్టలేదు.

మరునాడు అయిదు గంటలకు రమ శ్రీ కృష్ణవిలాస్‌లోకి వచ్చేటప్పటికి—ఈశ్వరరావు అంతకుముందే వచ్చివున్నాడు. రమకు పట్టరాని సంతోషమైంది. కాని ఆ సంతోషాన్ని కనపర్చదల్చలేదు. ఈశ్వరరావును చూడనట్లే ముఖం ప్రక్కకు తిప్పుకొని కూర్చుంది. ఆ ప్రక్క తిప్పడం ముఖానికి కారణాన్ని తెలుసుకున్న ఈశ్వరరావు—

“రమా! క్షమించు. నిన్ను అపార్థం చేసికొని, నీ హృదయానికి బాధను కలిగించాను” అన్నాడు.

ఆ మాటలకే రమ హృదయం కరగి నీటికంటె పల్చనైంది.

ఈశ్వరరావు వంక వికసిత ముఖంతో చూసింది.

బోయ్ రెండు కాఫీ కప్పులు తెచ్చి ముందు పెట్టాడు.

ఆ కాఫీ త్రాగుతూ ఆ ప్రేమికులు చూపులతో హృదయాలను నింపుకున్నారు.

తీరా ఇంటికి వెళ్ళి ఆలోచించుకున్నాక రమకు మగవాళ్ళంతా ఇంతేనేమో నని సందేహం కలిగింది. ★